క్లుప్తంగా

త్వరలోనే మిషన్ శక్తి, వాత్సల్య సమావేశం



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మిషన్ కో-ఆర్డినేటర్ బాలమణి

కర్నూలు(సెంట్రల్): మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య కార్యక్రమాలపై అధికారుల సమన్వయం కోసం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరినట్లు జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కేవీ బాలమణి చెప్పారు. ఆమె శుక్రవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య కార్యక్రమాలతో బాలలాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాలల్లో పోషకాహార లోపాన్ని సరిదిద్దేందుకు ఆయా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ పారా మెడికల్ అధికారి రేష్మ, పీఎఫ్ఓ జి.లలితమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): దివ్యాంగుల పింఛన్ తొలగించి వారి కడుపు కొట్టడం అన్యాయమని, ఇది కూటమి ప్రభుత్వానికి తగదని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీబాషా శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు లేనిపోని ఆశలు పెంచి మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఉన్న పెన్షన్లను తొలగించడం అన్యాయమన్నారు. ముఖ్యంగా పెన్షన్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం దారుణమని మండిపడ్డారు. వృద్ధుల పింఛన్లలో కోత పెట్టడం అత్యంత హేయమైన చర్య అన్నారు.

13న జిల్లా రెడ్‌క్రాస్ సమావేశం

కర్నూలు(సెంట్రల్): జిల్లా రెడ్‌క్రాస్ సాధారణ సమావేశం సెప్టెంబర్ 1న కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన నిర్వహించాలని నిర్ణయించినట్లు డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న జిల్లా కమిటీ కాలపరిమితి సెప్టెంబర్ 15వ తేదీన ముగియనున్న నేపథ్యంలో నూతన కమిటీని ఎన్నుకొనేందుకు లల్లా రెడ్‌క్రాస్ ప్యాట్రన్‌లు, వైస్ ప్యాట్రాన్‌లు, జీవితకాల సభ్యులు, అసోసియేట్ సభ్యులు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు. సభ్యులంతా గుర్తింపు కార్డులను కచ్చితంగా వెంట తెచ్చుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ మెంబర్‌షిప్ లేని వారిని అనుమతించబోమని చెప్పారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా గీతామాధురి




కర్నూలు కల్చరల్: బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా గీతా మాధురి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడుగా సునీల్ రెడ్డిని ప్రకటించారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,570	7,022
పొద్దుతిరుగుడు	5,059	6,060
ఆముదం	6,129	6,129
వాము	569	2,300
ఉల్లి	505	1,599
ఎండుమిర్చి	4,860	6,195
శనగలు	5,769	5,769
కందులు	4,497	6,246
మొక్కజొన్న	2,289	2,401
మినుములు	4,897	7,180
కొర్రలు	1,629	3,189
సోయాచిక్కుడు	1,200	1,200
నజ్జలు	1,039	1,039

ఫోన్ నం : 08518-257204, 257661

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : కూలీ, వార్ 2,మహావతార్ నరసింహ, బన్ బటర్ జామ్,సు ఫ్రం సో, పరదా
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కూలీ,వార్ 2, యూనివర్సిటీ (2023),మహావతార్ నరసింహ , మేఘాలు చెప్పిన ప్రేమకథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బన్ బటర్ జామ్, వార్ 2,మహావతార్ నరసింహా
శ్రీరామ : కూలీ
రాజ్ : పరదా
భరత్ కాంప్లెక్స్ : మహావతార్ నరసింహా
విజయ : వార్ 2
విక్టరీ :హరిహర వీరమల్లు

తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్ నుంచి విముక్తి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే చికిత్స సులభమై రోగి కోలుకునే అవకాశం ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో శుక్రవారం అసంక్రమిత వ్యాధుల ఎన్‌సీడీ 4.ఓ క్యాన్సర్ వ్యాధి నివారణపై పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించుకోవాలని సూచించారు. మానవ శరీరంలో గోళ్లకు, వెంట్రుకలకు తప్ప అన్ని భాగాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని తెలిపారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ మాట్లాడుతూ.. క్యాన్సర్ తీవ్రంగా ముదరకముందే వైద్యం తీసుకుంటే మళ్లీ సాధారణ జీవితం గడపవచ్చన్నారు. క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి అనుమానిత లక్షణాలున్న వారిని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళ, గురువారాల్లో ఓపీ నెంబర్ 22కు పంపించాలని సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, తగిన శారీరక శ్రమ లేకపోవడం కారణంగా క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయని చెప్పారు. అనంతరం ఎస్పీఎం హెచ్ఓడీ డాక్టర్ సుధారాణి, ప్రొఫెసర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింధియా శుభప్రద క్యాన్సర్ వ్యాధిపై సూచనలు చేశారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్‌ప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

స్వర్ణాంధ్ర-2047 ప్రగతిపై క్షేత్రస్థాయిలో ప్రోగ్రామ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. ఆమె శుక్రవారం తన ఛాంబర్‌లో స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి పరిధిలో జిల్లా స్థాయిలో 5 సూచికలు, మండల స్థాయిలో 18 సూచికలు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ వారి పరిధిలో జిల్లాస్థాయిలో 5 సూచికలు, మండల స్థాయిలో రెండు సూచికలు ఉన్నాయని చెప్పారు. వీటి ప్రగతిని ప్రోగ్రాం అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీటి వల్ల 2047 నాటికి సంపన్నమైన, ఆరోగ్యకరమైన, ఆనంద ఆంధ్రప్రదేశ్‌ను సాధించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో డీపీఎంఓ డాక్టర్ ఉమ, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్, ఎస్ఓ హేమసుందరం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రను పకడ్బందీగా చేపట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పలు అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు జిల్లాలో నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మాన్‌సూన్ హైజీన్ అనే థీమ్‌తో నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెరుగైన సేవలందించే వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చేలా అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. హొళగుంద మండలంలోని మద్దిలింగదహళ్లి, దేవనకొండ మండలం కరివేముల, పాలకుర్తి, ఆస్పరి, కైరుప్పల, కౌతాళం మండలం నదిచాగి, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, వెల్దుర్తి మండలం అల్లుగుండు, కోసిగి మండలంలోని వందనగల్లు తదితర గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ చేయడం లేదని ఫిర్యాదులు వచ్చాయని, ప్రతి గ్రామంలో చెత్త సేకరణ జరిగేలా చూడాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. ఫారం పాండ్స్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. జల్ సంచయ్ జన్ భాగీదరి పథకంలో భాగంగా గత మూడేళ్లలో చేపట్టిన డిస్టిలింగ్, నీటి సంరక్షణ, సోక్‌పిట్స్, ఫారం పాండ్స్‌లో పూర్తైన పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్వామిత్వలో భాగంగా పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను వారం రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్ల రద్దుపై 25న ధర్నా



పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం నాయకులు డి.పార్వతయ్య, ఎస్ఎండీ షరీఫ్ స్పష్టం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పునర్విచారణ పేరుతో దివ్యాంగ పింఛనుదారులను వేధిస్తోందన్నారు. దివ్యాంగులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న వికలత్వం శాతాన్ని కుదించి పెన్షన్‌కు అనర్హులంటూ నోటీసులు ఇవ్వడం, మళ్లీ సదరం క్యాంపులకు వెళ్లాలని చెప్పడం దారుణమన్నారు. జిల్లాలో దాదాపు 10 వేల మంది వికలాంగ పెన్షన్లను సెప్టెంబ ర్ నుంచి తొలగించనున్న నేపథ్యంలో పునరుదర్ధించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

పల్లకీలో కృష్ణ భగవానుడి విహారం



ఓర్వకల్లులో కృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని కొలువుంచిన స్వాముల వారి ప్రతిమను శుక్రవారం మధ్యాహ్నం అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాముల వారి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని నందికొట్కూరు రోడ్డులో గల పాల డైరీ పక్కన కొలువుంచిన స్వాముల వారికి వారం రోజుల పాటు భక్తులు నిత్యపూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అశేష జనసందోహాల మధ్య స్వాముల వారి ప్రతిమను పల్లకీలో ఆశీనులను గావించి, ప్రాంగణం నుంచి బయలుదేరి మెయిన్‌బజార్, రచ్చకట్ట మీదుగా ఆంజనేయస్వామి గుడి వరకు స్వాముల వారిని ఊరేగించారు. అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు శ్రీకృష్ణుడి నామస్మరణతో గీతాలు ఆలపించారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓర్వకల్లు, చింతలపల్లె ఉత్సవ కమిటీ సభ్యులు చిన్నపుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కుమారాచారి, సంజీవ, పార్థసారథి, నాగమద్దిలేటి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై డీఎస్పీతో మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి వినాయక ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. కేసీ కెనాల్‌కు మరమ్మతు పనులు, ఘాట్‌కు పెయింటింగ్, వేదిక, సౌండ్ సిస్టమ్, క్రేన్లు, గత ఈతగాళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పారిశుద్ధ్యం, రహదారులపై ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టాలన్నారు. ఎమ్మార్వో రవి కుమార్, డీఎస్పీ బాబు ప్రసాద్, ఎంఈ మనోహర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, రంగస్వామి, గిరిరాజ్ వర్మ పాల్గొన్నారు.

రైతుబజారులో ప్లాస్టిక్ కవర్లపై నిషేధం

- తనిఖీల్లో పట్టుబడితే చర్యలు
- సీ.క్యాంపు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి ఆదేశం



ప్లాస్టిక్ నిషేధంపై ఆదేశాలు చేస్తున్న ఎస్టేటు అధికారి కళ్యాణి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజారులో ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్యలు తప్పవని సీ.క్యాంపు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో రైతుబజారులోని వివిధ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతుబజారులో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నగరపాలక సంస్థ అధికారులు ఆదేశించారని, ఈ నిషేధాన్ని వ్యాపారులందరూ తప్పక పాటించాలన్నారు. మున్సిపల్ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు లభించినా.. వినియోగం కనిపించినా భారీ ఎత్తున జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగ్‌లు, పేపర్ సంచులు వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందగా ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి కట్టుబడితే పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసిన వాళ్లు అవుతారని పేర్కొన్నారు. హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు దామోదరం పేరు పెట్టాలి



సంతకాల సేకరణ చేపట్టిన సమితి నేతలు

కర్నూలు(అర్బన్): కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని దామోదరం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సమితి నేతలు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరును పెట్టాలని దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలోనే పాత బస్టాండ్, రాజ్‌విహార్, జిల్లా పరిషత్ ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కురువ సంఘం అధ్యక్షుడు అయ్యన్న మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య పేరును జిల్లాకు పెట్టడం సబబన్నారు. బలిజ సంఘం అధ్యక్షుడు డీ.పరమేశ్వరయ్య, బీసీ సంఘం నాయకులు కరుణాకర్, ఫణీంద్ర, నాయకులు జేవీ కృష్ణయ్య, రామశేషయ్య, దామోదరం రాధాక్రిష్ణమూర్తి, నాగభూషణం, సీవీ వర్మ, ప్రేమ్ కుమార్ రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి



ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారుల సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి సూచించారు. ఆమె శుక్రవారం తన కార్యాలయం నుంచి డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు అర్బన్ నుంచే కాకుండా జిల్లాలోని వివిధ మండలాల నుంచి 18 మంది పలు సమస్యలను ఎస్ఈ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. వర్షాలు పడుతున్నందున విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే స్పందించాలని సూచించారు. లోవోల్టేజీ, హై వోల్టేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కమర్షియల్ డీఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

ముగిసిన రగ్బీ లీగ్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహిళల రగ్బీ లీగ్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా క్రిష్ణగిరి కేజీబీవీ, రెండవ స్థానంలో పత్తికొండ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల, మూడో స్థానంలో కంబాలపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ కప్పు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేంద్ర, క్రీడా ప్రతినిధులు దాసరి సుధీర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

కర్నూలు సిటీ: నగర శివారులోని సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీలో శుక్రవారం మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ఈగల్ కర్నూలు సెల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈగల్ సెల్ ఎస్ఈ సుజన్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. యువత గంజాయి మత్తు మందులకు దూరంగా ఉండాలన్నారు. మత్తుకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, సామాజిక బాధ్యతగా మాదక ద్రవ్యాల వాడకం ఎక్కడ కనిపించినా 1972 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని శిక్షలు, జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలరే వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కరెస్పాండెంట్ ఎ.విజయభాస్కర్, ఎస్.ఆంటోని రాజు, వైస్ ప్రిన్సిపాల్ జి.బాబులాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. స్వామిరెడ్డి నగర్, బ్లడ్ బ్యాంక్, డ్రగ్ స్టోర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు జేవీవీ మహాసభలు

కర్నూలు కల్చరల్: జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలను ఈ నెల 24వ తేదీన యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు పే ర్కొన్నారు. జేవీవీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అందరూ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాసవీ మాతకు గాజుల అలంకరణ

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు, అర్చనలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విష్ణు సహస్ర నామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తర నామాలతో కుంకుమార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాతకు మంగళకరమైన గాజులతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

తుగ్గలి : సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్, జొన్నగిరి పోలీసులు సంయుక్తంగా మండలంలోని రోళ్లపాడు తండాలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల నాటుసారా, 50 కేజీల సారాకు ఉపయోగించే బెల్లం సీజ్ చేసి వెంకటనాయక్‌పై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ స్వర్ణలత, ఎక్సైజ్ ఎస్ఐ రాజేష్, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

వెల్దుర్తి: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన దేశపోగు రమేశ్ (33) కనిపించడం లేదని తండ్రి నారాయణ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. ఈనెల 21న బైక్‌పై కర్నూలుకు వెళ్లి వస్తానని వెళ్లి తిరిగి రాలేదని, పలు చోట్ల వెదికినా ఫలితం లేకపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు రమేశ్ భార్య చనిపోగా అతనిపై కేసు పెండింగ్‌లో ఉంది. గ్రామం నుంచి వెళ్లిననాటి నుంచి అతని ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ వస్తుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

టీబీపై అవగాహన



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న కల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది

కల్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెట్లమల్లాపురం గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గిపోవడం, పొగ తాగువారు, మద్యం సేవించు వారు, పోష్టికాహారలోపం ఉన్న వారందరూ గళ్ల పరీక్ష, ఎక్స్ రే పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ ఎస్.భూపాల్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చెత్త సేకరణ

కల్లూరు: గ్రామాల్లో పకడ్బందీగా చెత్త సేకరణ నిర్వహించాలని ఎంపీడీఓ నాగేశ్వాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం నెరవాడ గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్ పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి (ఎస్‌డబ్ల్యూపీసీ)కి తరలించాలన్నారు. చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు.

ఉరుకుందకు పాదయాత్ర

కోడుమూరు రూరల్: గూడూరు నుంచి ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం 50 మందికి పైగా భక్తులు కాలినడకన తరలివెళ్లారు. శ్రావణ మాసం పురస్కరించుకుని భక్తులు శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి మాలాధారణ ధరించి 40 రోజుల పాటు నియ మ నిష్టలతో పూజలు నిర్వహించారు. ముడుపులను స్వామి వారికి సమర్పించి స్వామి వారి సన్నిధిలో దీక్షలను విరమించనున్నారు. కాలినడకన వెళుతున్న భక్తులను సాగనంపేదుకు పట్టణవాసులు తరలివచ్చారు.

పేరుకుపోయిన చెత్తచెదారం





దొడ్డిపాడులోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తచెదారం

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు పెద్దటేకూరు గ్రామ పంచాయతీ మజారా గ్రామమైన దొడ్డిపాడులోనివి. కర్నూలు జిల్లాలో పెద్దటేకూరు గ్రామ పంచాయతీని మోడల్ పంచాయతీగా నిర్ణయించి ఇతర మండలాలకు చెందిన అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. అలాగే పారిశుద్ధ్యంపై అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే మజారా గ్రామమైన దొడ్డిపాడులో పారిశుద్ధ్య చర్యలను పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో సుమారుగా 1400 మంది జనాభా, 900 మందికిపైగా ఓటర్లు ఉన్నా పారిశుద్ధ్య లోపాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్‌ను వివరణ కోరగా దొడ్డిపాడు గ్రామం హంద్రీ నదికి అవతల ఉండటంతో ట్రాన్స్‌పోర్టు ఇబ్బందిగా మారింది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పారు – కల్లూరు

ఎస్సీ యువతకు డ్రైవింగ్ శిక్షణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన యువతకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్ల వయస్సు పైబడి కనీసం ఒక ఏడాది లైట్ మోటారు వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న స్త్రీలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన యువత అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోగా స్థానిక బిర్లాగేట్ సమీపంలోని ఎస్సీ కార్పొరేషన్‌లో అందించాలన్నారు. ఈ శిక్షణకు ఐదుగురు స్త్రీలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా ఫీజును ఎస్సీ కార్పొరేషన్ భరిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరింత సమాచారం కోసం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సెల్ 70329 95543 నంబర్‌లో సంప్రదించాలన్నారు. శిక్షణ కాలం 40 క్యాలెండర్ రోజుల్లో 32 పని దినాలు ఉంటుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం అభ్యర్థుల ఎంపిక ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. అలాగే ఎంపికైన అభ్యర్థులకు తాత్కాలిక శిక్షణా కార్యక్రమం సెప్టెంబర్ 5వ తేదీన ప్రారంభం అవుతుందని తెలిపారు.